సాక్షి
గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

శుక్రవారం | 10 | మార్చి | 2023




వనితా వందనం

సుమారు 500కు పైగా మొక్కలు.. ప్రతి మొక్కకు ఒక అధికారి పేరు.. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కాకతీయ యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన 'వనితా వనం'ను ప్రారంభించారు. దాంతోపాటు తల్లీబిడ్డల కుడ్య చిత్రం తీర్చిదిద్దారు. వచ్చేది ఎండాకాలం.. రోజూ నీళ్లు పోసి మొక్కలను, పచ్చికను కాపాడుతారో.. లేదా చూడాల్సిందే..

న్యూస్‌రీల్

సౌత్‌జోన్ ఇంటర్‌వర్సిటీ పోటీలకు కేయూ జట్ల ఎంపిక




కేయూ క్యాంపస్: చండీగఢ్‌లోని పంజాబ్ యూనివర్సిటీలో ఈ నెల 10నుంచి 14వ తేదీ వరకు జరగనున్న ఇంటర్ యూనివర్సిటీ జిమ్నాస్టిక్స్ (పురుషుల, మహిళల) కేయూ జట్టును ఎంపిక చేసినట్లు స్పోర్ట్స్‌బోర్డు సెక్రటరీ డాక్టర్ సవితాజ్యోత్స్న గురువారం తెలిపారు. వీరిలో పురుషుల విభాగంలో కె.కృష్ణాచారి, పి.సూర్యదేవ్, సీహెచ్.ప్రవీణ్‌కుమార్, డి.మోహన్‌కుమార్, ఎండీ ఉమ్అలీ, ఆర్టిస్టిక్స్ జిమ్నాస్టిక్స్ మహిళల విభాగంలో ఎల్.ప్రేమలత, ఎల్.శిరీష, రిథమిక్ జిమ్నాస్టిక్స్‌లో శ్రీసాయిభవ్య ఉన్నారు. వీరికి మేనేజర్‌గా జేఎస్ఎస్ కోచ్ విజయకుమార్ వ్యవహరిస్తారని సవితాజ్యోత్స్న తెలిపారు.

చెస్‌పోటీలకు..

చెన్నైలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో ఈ నెల 10నుంచి 12వ తేదీ వరకు జరిగే సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ చెస్ పోటీలకు కేయూ క్రీడాకారులను ఎంపిక చేశారు. వీరిలో బి.రామచందర్, జి.కార్తీక్, ఎస్.అఖిల్, ఎ.తరుణ్, జె.ఉపేందర్, ఓ.రంజిత్ ఉన్నారు. వీరికి మేనేజర్‌గా మహబూబాబాద్ విజ్ఞాన భారతి డిగ్రీ పీజీ కళాశాల పీడీ కె.రమేష్ వ్యవహరిస్తారని సవితాజ్యోత్స్న తెలిపారు.

ఉద్యోగ బాధ్యతల్లోనూ రాణింపు



ఎంజీఎం : మహిళలు ఇంటి బాధ్యతలే కాకుండా.. ఉద్యోగ బాధ్యతల్లో సైతం విజయవంతంగా రాణిస్తున్నారని పీఓడీటీ లలితాదేవి అన్నారు. గురువారం హనుమకొండ డీఎంహెచ్ఓ కార్యాలయంలో మహిళ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లలితాదేవితోపాటు మహిళా ఉద్యోగులను సన్మానించారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ సాంబశివరావు, అడిషనల్ డీఎంహెచ్ఓ మదన్‌మోహన్‌రావు, ప్రోగ్రాం అధికారులు వాణిశ్రీ, ఉమాశ్రీ, గోపాల్‌రావు, డెమో అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేశాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం



హసన్‌పర్తి: దేశాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకమని హనుమకొండ జిల్లా స్త్రీశిశు సంక్షేమశాఖ అధికారి సబిత అన్నారు. 56వ డివిజన్ గోపాలపురంలో సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ మహిళా దినోత్సవ వేడుకలు ర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని పిలుపునిచ్చారు. స్థానిక అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లను శాలువాలతో సత్కరించారు. మహిళా సమన్వయ సమితి అధ్యక్షురాలు అరుణాదేవి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ప్రొఫెసర్ పీవీ సుజాత, న్యాయవాది గోపు వనజ, డాక్టర్ రవళి, డాక్టర్ హర్షిణి, డాక్టర్ శోభారాణి, కార్పొరేటర్ సునీల్ కుమార్, సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి యుగంధర్ పాల్గొన్నారు.

ఇంటర్నెట్ సమస్య.. ఆర్టీఏ సేవల్లో జాప్యం

హసన్‌పర్తి: ఇంటర్‌నెట్ సమస్య కారణంగా హనుమకొండ ఆర్టీఏ కార్యాలయంలో రెండు రోజులుగా సేవలు మందకొడిగా నడుస్తున్నాయి. బుధ, గురువారాల్లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వాహనదారులకు ఇబ్బందులు తప్పలేదు. ఉదయం 10.30గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. మధ్యాహ్నం ఒంటి గంట వరకు సాంకేతిక కారణాల వల్ల ఇంటర్‌నెట్ లేకపోవడంతో కార్యాలయంలోని నిలిచిపోయాయి. ఒంటి గంట తర్వాత సమస్య పరిష్కారం కావడంతో సేవలు యథావిధిగా ప్రారంభమయ్యాయి. దీంతో ఉదయం వచ్చిన వాహనదారులు సాయంత్రం వరకు అక్కడే ఉండిపోయారు.

పచ్చదనం పెంచేందుకు కృషి : మేయర్



జూమ్ మీటింగ్‌లో మాట్లాడుతున్న మేయర్

వరంగల్ అర్బన్: వరంగల్ మహా నగరంలో పచ్చదనం పెంచడానికి కృషి చేస్తున్నట్లు మేయర్ గుండు సుధారాణి తెలిపారు. గురువారం సాయంత్రం లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామీ అకాడమీ ఆధ్వర్యంలో 'అర్బన్ 95' అనే అంశంపై ఏర్పాటు చేసిన జూమ్ మీటింగ్‌లో అంతర్జాతీయంగా వివిధ దేశాలనుంచి 113మంది మేయర్లు, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొని తమ ప్రాంతాల్లో పచ్చదనం, పల్లల సమగ్ర అభివృద్ధి చేస్తున్న కార్యక్రమాలు, సమస్యలు, వాటిని అధిగమించేందుకు సూచనలు, సలహాలు చేశారు. అందులో మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ బడ్జెట్‌లో 10 శాతం ప్రత్యేకంగా నిధులు కేటాయించడం వల్ల వరంగల్ నగరంలో పార్కులు, ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటుతున్నట్లు తెలిపారు. ప్రకృతి వనాల ఏర్పాటు, సెంట్రల్ మెడియన్స్ అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. నగరవాసులకు ఆహ్లాదకరమైన వాతావరణం అందించడానికి 66 డివిజన్లలో అనేక పర్యావరణ సంబంధ కార్యక్రమాలను చేపడుతున్నట్లు వెల్లడించారు. జూమ్ మీటింగ్‌లో బల్దియా కమిషనర్ ప్రావీణ్య, చీఫ్ హార్టికల్చర్ ఆఫీసర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మహా దూకుడు

ఆస్తి, నీటిపన్ను బకాయిదారులపై కొరడా

- రెడ్ నోటీసులు జారీ, ఆస్తుల జప్తు
- 22 రోజులు.. రూ.36కోట్లు
- వందశాతం వసూలుకు చర్యలు
- 11 ప్రత్యేక బృందాలను నియమించిన కమిషనర్ ప్రావీణ్య



వరంగల్ అర్బన్: ఎప్పుడైనా చెల్లించక తప్పని ఆస్తి, నీటిపన్నుల పట్ల నగరవాసులు ప్రదర్శిస్తున్న జాప్యంపై క్షేత్రస్థాయిలో కఠినంగా వ్యవహరించాలని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ నిర్ణయించింది. వందశాతం వసూళ్లు చేపట్టే లక్ష్యంగా కార్యాచరణ సిద్ధమైంది. రూ.36కోట్లకు తగ్గకుండా వసూలు చేయాలని లక్ష్యంతో ఏళ్ల తరబడి పన్ను కట్టని మొండి బకాయిదారులకు రెడ్ నోటీసులు జారీ చేసి ఆస్తులు జప్తు చేయనున్నారు.

నయానా..భయానా...

బల్దియాకు ప్రధాన ఆదాయ వనరు పన్నులు. పరిపాలన సవ్యంగా సాగాలంటే ఆస్తి, నీటిపన్నులు ఎలాగైనా వసూలు చేయాల్సిందే. ఇంతకాలం చూసీచూడనట్లుగా వ్యవహరించిన పన్నుల విభాగం అధికారులు, సిబ్బంది ఇటీవల కాలంలో వేగం పెంచారు. మొదటి ఆరు నెలలు ఏప్రిల్ టు సెప్టెంబర్‌తోపాటు రెండో ఆరు నెలలు అక్టోబర్ నుంచి మార్చి 31వరకు చెల్లించాల్సిన పన్నుల వసూళ్లపై దృష్టి కేంద్రీకరించారు. పది రోజులుగా కసరత్తు చేసి డివిజన్ల వారీగా మొండిబకాయిదారులను తీసుకున్నారు. డివిజన్‌లో- 25 టాప్‌లిస్టులో బకాయిదారులపై కొరడా ఝుళిపిస్తున్నారు. మరో 22 రోజులైతే ఈ ఆర్థిక సంవత్సరం ముగిస్తున్న నేపథ్యంలో మిగతా డబ్బులను వసూలు చేసి లక్ష్యాన్ని సాధించాలని అధికారులు భావిస్తున్నారు. వసూళ్లల్లో ఎలాంటి నిర్లక్ష్యం వహించొద్దని, వందశాతం వసూళ్ల దిశగా కార్యాచరణ రూపొందించుకోవాలని సూచిస్తున్నారు. అధికారులు సైతం ప్రత్యేక బృందాలుగా, ఏరియాల వారీగా ఆర్ఐలకు, బిల్ కలెక్టర్లకు టార్గెట్లు నిర్ణయించారు. రోజు వారీగా వాకీటాకీల ద్వారా సమీక్షలు చేస్తున్నారు.

ఆస్తుల జప్తు, సీజ్

మొండి బకాయిదారుల నుంచి నయానా.. భయాన పన్నులు వసూలు చేసేందుకు సిబ్బంది వివిధ రకాల చర్యలకు పాల్పడుతున్నారు. పేద, మధ్య తరగతి వర్గాలపై జబర్దస్తీగా వసూళ్లకు పాల్పడుతున్నారు. పేదల ఇళ్ల తలుపులు, ఇతర వస్తువులు జప్తు చేస్తున్నారు. అవసరమైతే నల్లా కనెక్షన్లను సీజ్ చేయాలని యోచిస్తున్నారు.

11 ప్రత్యేక బృందాలు, డివిజన్లు

ఆస్తి, నీటిపన్నుల వసూళ్ల కోసం 11 ప్రత్యేక బృందాలను నియమిస్తూ ఇటీవల కమిషనర్ ప్రావీణ్య ఆదేశాలు జారీ చేశారు. బల్దియా పన్నుల విభాగం, టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్, పరిపాలన విభాగం సిబ్బందిని ఇందులో నియమించారు. ఈ నెల 31లోగా ఎలాంటి సెలవు తీసుకోకుండా విధులకు హాజరుకావాలని ఆదేశించారు. కాగా, క్షేత్రస్థాయిలో పన్నుల వసూళ్లలో ఏమైనా ఘర్షణలు జరిగే అవకాశం ఉందన్న సమాచారంతో ప్రతి బృందంలో ఒక హోంగార్డును నియమించారు. రవాణా నిమిత్తం జీపును కూడా ఇచ్చారు.

9మంది సీఐల బదిలీ!

- ఉమ్మడి వరంగల్‌లోని పోలీస్ ఇన్‌స్పెక్టర్లకు స్థానచలనం
- ఇతర జిల్లాలనుంచి ఇద్దరు కమిషనరేట్‌కు
- ఖాళీగా కాజీపేట, మట్టెవాడ పీఎస్‌లు..
- పోస్టింగ్‌ల కోసం పోటాపోటీ...
- త్వరలోనే మరికొందరు సీఐల బదిలీ, పోస్టింగ్‌లు?



సాక్షిప్రతినిధి, వరంగల్: మల్టీజోన్-1 (నార్త్‌జోన్) పరిధిలో పనిచేస్తున్న పలువురు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సీఐ)లను బదిలీ చేస్తూ ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. మొత్తం 21మందిని ఐజీ బదిలీ చేయగా.. ఉమ్మడి వరంగల్‌లో 9 మందికి స్థానచలనం కలిగింది. మహబూబాబాద్, జేఎస్ భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం తదితర జిల్లాల్లో ఉన్న కొందరు వరంగల్ కమిషనరేట్‌కు రాగా, కమిషనరేట్ పరిధిలో పనిచేస్తున్న సీఐలు రామగుండం కమిషనరేట్, ఖమ్మం, భూపాలపల్లి జిల్లాలకు బదిలీ అయ్యారు. పరిపాలనాపరమైన నిర్ణయాలలో భాగంగా బదిలీలు, పోస్టింగ్‌లు ఇచ్చినట్లు ఐజీ ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాజీపేట టౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గట్టు మహేందర్ రెడ్డి రామగుండం కమిషనరేట్ పరిధిలోని మందమర్రి సీఐగా బదిలీ అయ్యారు. జేఎస్ భూపాపల్లిలో సీసీఎస్ సీఐగా ఉన్న ఎస్.వాసుదేవరావును రామగుండం పరిధిలోని చెన్నూరు టౌన్ ఎస్‌హెచ్ఓగా, చెన్నూరు సీఐ టి.ప్రవీణ్‌కుమార్‌ను శ్రీరాంపూర్ మహిళ పోలీస్‌స్టేషన్ సీఐగా నియమించారు. అదేవిధంగా భూపాలపల్లి ఇన్‌స్పెక్టర్ సీహెచ్ రాజిరెడ్డిని ఖమ్మం రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా నియమించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా డీసీఆర్‌బీ సీఐ డి.వేణుచందర్‌ను జేఎస్ భూపాలపల్లి జిల్లా చిట్యాల సీఐగా బదిలీ చేసి, అక్కడున్న పులి వెంకటిని జేఎస్ భూపాలపల్లి సీసీఎస్ సీఐగా నియమించారు. వరంగల్‌లో వెకెన్సీ రిజర్వులో ఉన్న బానోతు రమేష్‌ను మహబూబాబాద్ రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా, మహబూబాబాద్ రూరల్ సీఐగా ఉన్న ఎస్.రవికుమార్‌ను అక్కడే పీసీఆర్ ఇన్‌స్పెక్టర్‌గా, పీసీఆర్‌లో ఇన్‌స్పెక్టర్‌గా ఉన్న డి.రవిరాజ్‌ను బానోతు రమేష్ స్థానంలో వరంగల్ కమిషనరేట్‌కు అలాట్ చేశారు. పోస్టింగ్ కోసం వెయిటింగ్‌లో ఉన్న సీఐ కంప రవిందర్‌ను కూడా వరంగల్ కమిషనరేట్‌ను అలాట్ చేశారు.

పోస్టింగ్‌ల కోసం పోటాపోటీ..

కమిషనరేట్ పరిధిలో పనిచేసేందుకు పలువురు ఇన్‌స్పెక్టర్లు పోటీ పడుతున్నారు. గురువారం వెలువడిన బదిలీ ఉత్తర్వుల్లో పలువురి పోస్టింగ్‌లపై 'పొలిటికల్' కనిపించందన్న చర్చ పోలీస్ వర్గాల్లో మొదలైంది. అయితే ఈ బదిలీల్లో కీలకమైన కాజీపేట టౌన్ పోలీస్‌స్టేషన్‌కు ఇంకా ఎవరినీ కేటాయించకపోగా, మట్టెవాడ పోలీస్‌స్టేషన్‌కు భలే డిమాండ్ ఉంది. ఈ రెండింటితో పాటు త్వరలోనే మరో నలుగురైదుగురు ఇన్‌స్పెక్టర్‌ల బదిలీలుంటాయన్న ప్రచారం కూడా జరుగుతోంది. ఖాళీలతో పాటు బదిలీల స్థానాల్లో పోస్టింగ్ కొట్టేందుకు ప్రజాప్రతినిధుల 'లేఖల' కోసం చేస్తున్న ప్రయత్నాలపై బాహాటంగానే చర్చ జరుగుతోంది.

అనుకున్న చోటే కలెక్టరేట్

- వరంగల్ సమీకృత కలెక్టరేట్ నిర్మాణానికి పచ్చజెండా
- ఆజంజాహి మిల్లు కార్మికుల వివాదం 'సుప్రీం'లో క్లియర్
- మడిపల్లి, అనంతసాగర్‌లో అర్హులకు ప్లాట్లు ఇవ్వండి సుప్రీం సూచన
- మడిపల్లిలో ఇవ్వాలని నిర్ణయించిన కుడా చైర్మన్?
- మిల్లు స్థలంలో 26.68 ఎకరాలు ఇవ్వాలంటూ సర్కారుకు కలెక్టర్ లేఖ



వరంగల్ సమీకృత కలెక్టరేట్ నిర్మాణానికి కేటాయించిన స్థలం ఇదే..

సాక్షి, వరంగల్: నగరంలోని ఆజంజాహి మిల్లు స్థలంలో నిర్మించాలనుకున్న వరంగల్ సమీకృత కలెక్టరేట్ విషయంలో ముందడుగు పడింది. ఇళ్ల స్థలాల విషయంలో మిల్లు కార్మికులు(స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేసిన) 318 మంది సుప్రీంలో వేసిన కేసు క్లియర్ కావడంతో కలెక్టరేట్ నిర్మాణానికి మార్గం సుగమమైంది. అర్హులైన కార్మికులకు కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(కుడా) మడిపల్లి, అనంతసాగర్‌లో లే అవుట్ ప్లాట్లు కేటాయించి.. సకల సౌకర్యాలతో అభివృద్ధి చేసి ఇవ్వాలని ఫిబ్రవరి 24న సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. సరైన స్థలం లేదని కలెక్టర్ గోపి సమాధానం ఇవ్వడంతో.. 'కుడా' భూముల్లో ప్లాట్లు కేటాయించాలని ఆదేశాలిచ్చింది. ఈ నేపథ్యంలో మడిపల్లిలోని 32 ఎకరాల్లో కార్మికులకు స్థలం కేటాయించాలని కుడా చైర్మన్ ప్రావీణ్య నిర్ణయించినట్లు తెలిసింది. మిల్లు కార్మికులకు ప్లాట్లు కేటాయిస్తే 'కుడా'పై దాదాపు రూ.200కోట్ల భారం పడనుంది.

స్థల కేటాయింపులు ఇలా..

వరంగల్ మండలం లక్ష్మీపురంలోని సర్వే నంబర్లు 68, 69, 70, 71, ఖిలా వరంగల్ మండలంలోని 369, 378, 379లో 6.16 ఎకరాల్లో సమీకృత కలెక్టరేట్ సముదాయంతోపాటు వరంగల్ లక్ష్మీపురంలోని 64, ఖిలా వరంగల్‌లోని 381 సర్వే నంబర్లలోని 2.32 ఎకరాల్లో చేనేత, జౌళి రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ ఆఫీసుకు రాష్ట్ర ప్రభుత్వం 2021 డిసెంబర్‌లో స్థలం కేటాయించింది. సుప్రీంకోర్టులో ఆజంజాహి మిల్లు పాత కార్మికులు వేసిన స్పెషల్ లీవ్ పిటిషన్(ఎస్ఎల్‌పీ)లో లేని, వివాదం లేని సర్వే నంబర్లలో భూమిని కేటాయిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది. వరంగల్ కలెక్టర్(రెవెన్యూ విభాగానికి) బదిలీ చేసేందుకు జౌళి, చేనేత కమిషనర్‌కు అనుమతిస్తున్నట్లు సదరు జీఓలో స్పష్టంగా పేర్కొంది. అయినా ఇన్నాళ్లు మిల్లు కార్మికుల ఆందోళనతో ఈ విషయంలో సర్కార్ అడుగు ముందుకు పడలేకపోయింది. తాజాగా సుప్రీం ఇచ్చిన తీర్పుతో ఆజంజాహి మిల్లులోని 29 ఎకరాల స్థలం క్లియర్ కావడంతో కలెక్టరేట్‌పై దృష్టి పెట్టే అవకాశం ఉంది.

రాష్ట్ర ప్రభుత్వానికి కలెక్టర్ లేఖ

గతంలో ఈ 29 ఎకరాల్లోనే చేనేత, జౌళి రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ ఆఫీసుకు కేటాయించిన 2.32 ఎకరాలు పోను.. కలెక్టరేట్‌కు కేటాయించిన 6.16 ఎకరాలతోపాటు మిగిలిన స్థలాన్ని కలుపుకుని మొత్తం 26.68 ఎకరాలు ఇవ్వాలని, ఇందులో సమీకృత కలెక్టరేట్, పోలీస్ కార్యాలయం, కలెక్టర్, అదనపు కలెక్టర్ నివాసాలతోపాటు అన్నీ అక్కడే ఉండేలా ప్రణాళిక రూపొందించి నిర్మాణం చేపడతామంటూ కలెక్టర్ గోపి ఇటీవల ప్రభుత్వానికి లేఖ రాశారు. సాధ్యమైనంత తొందరగా స్థలాన్ని రెవెన్యూ విభాగానికి బదిలీ చేయాలని కోరారు. ఈ విషయాన్ని బుధవారం వరంగల్ పర్యటనకు వచ్చిన రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ దృష్టికి సైతం తీసుకెళ్లారు. స్పందించిన కేటీఆర్.. సంబంధిత జౌళి శాఖ ఉన్నతాధికారులతో మాట్లాడి క్లియర్ చేయాలని ఆదేశించినట్లు తెలిసింది. ఈ పరిణామాలతో ఏడేళ్ల కలెక్టరేట్ నిర్మాణ నిరీక్షణకు తెరపడే అవకాశం కనిపిస్తోంది.

పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు

- హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్
- ఇంటర్, టెన్త్ పరీక్షల నిర్వహణ, ఏర్పాట్లపై సమీక్ష



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్

హన్మకొండ అర్బన్: ఈ నెల 15నుంచి ఇంటర్మీడియట్, ఏప్రిల్ 3 నుంచి జరగనున్న ఎస్సెస్సీ వార్షిక పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్.. అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఆయా పరీక్షల నిర్వహణ, ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ పరీక్షల నిర్వహణ ఏర్పాట్లలో ఏ చిన్న పొరపాటు లేకుండా అధికారులు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తహసీల్దార్లు కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలన్నారు. సమావేశంలో డీఆర్ఓ వాసుచంద్ర, కాజీపేట ఏసీపీ శ్రీనివాస్, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి గోపాల్, డీఈఓ అబ్దుల్ హై, డీపీఓ జగదీశ్వర్, డీఎంహెచ్ఓ సాంబశివరావు, ఆర్టీసీ అధికారులు బాలునాయక్, తదితరులు పాల్గొన్నారు.

ఏప్రిల్ 3 నుంచి టెన్త్ పరీక్షలు...

ఏప్రిల్ 3నుంచి 13వ తేదీ వరకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పదవ తరగతి పరీక్షలు ఉండనున్నట్లు కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు. పరీక్షలకు మొత్తం 11,738 మంది విద్యార్థులు, ఇందులో 6,011మంది బాలురు, 5,727మంది బాలికలు హాజరుకానున్నట్లు చెప్పారు. ఇందుకోసం ఏ,బీ,సీ సెంటర్లుగా విభజించినట్లు తెలిపారు. ప్రశ్నపత్రాల స్టోరేజి కోసం 68 పాయింట్లు ఏర్పాటు చేశామన్నారు. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్, కస్టోడియన్ బృందాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఇంటర్ పరీక్షలకు.. 35,172మంది హాజరు..

హనుమకొండ జిల్లాలో ఈ నెల 15నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు ఇంటర్ పరీక్షలు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు జరుగుతాయని కలెక్టర్ పేర్కొన్నారు. ఫస్టియర్‌లో జనరల్ విద్యార్థులు 17,626మంది, ఒకేషనల్ 1,004మంది పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. సెకండియర్ జనరల్‌లో 15,552మంది, ఒకేషనల్‌లో 990మంది.. రెండు సంవత్సరాలు కలిపి మొత్తంగా 35,172మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు చెప్పారు. వీరికోసం 49 కేంద్రాలను ఏర్పాటు చేశామని, 49మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 49మంది డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లను నియమించినట్లు వివరించారు. అదనంగా చీఫ్ సూపరింటెండెంట్లను 36మందిని ప్రైవేట్ కళాశాలల పరీక్ష కేంద్రాల్లో నియమించామని తెలిపారు. 10మంది కస్టోడియన్లు, రెండు టీంల ఫ్లయింగ్‌స్క్వాడ్‌లు, మూడు టీంల సిట్టింగ్ స్క్వాడ్‌లు, 980మంది ఇన్విజిలేటర్లను అందుబాటులో ఉంచామన్నారు. 44 కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇంటర్ ప్రశ్నపత్రాల స్టోరేజికి 12 పాయింట్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి : గోపి



మాట్లాడుతున్న వరంగల్ కలెక్టర్ గోపి

కాళోజీ సెంటర్: వరంగల్ జిల్లాలో ఇంటర్, పదో తరగతి పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ డాక్టర్ బి.గోపి సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఇంటర్, టెన్త్ వార్షిక పరీక్షల నిర్వహణపై గురువారం సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 27 కేంద్రాల్లో 7,392 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు.

పదో తరగతి పరీక్షలు..

జిల్లాలో 9,728 మంది విద్యార్థులు పరీక్షలు రాయడానికి 56 కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. వేసవి దృష్ట్యా కేంద్రాల వద్ద ఏఎన్ఎంలు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీవత్స కోట, డీఐఈఓ మాధవరావు, డీఈఓ వాసంతి, అధికారులు పాల్గొన్నారు.

అపరిశుభ్రం
మానుకోట కేజీబీవీలో విద్యార్థినుల అస్వస్థత
వైభవంగా రౌషన్ షహీద్ దర్గా ఉర్సు - 10లో ▸

నగరవాసులకు రోజూ తాగునీరు

- మంత్రి కేటీఆర్ ఆదేశాలతో ప్రత్యేక చర్యలు
- సమీక్షించిన మేయర్ సుధారాణి, కమిషనర్ ప్రావీణ్య



మాట్లాడుతున్న మేయర్ సుధారాణి, పక్కన కమిషనర్ ప్రావీణ్య

వరంగల్ అర్బన్: రాష్ట్ర పురపాలక, ఐటీశాఖ మంత్రి కేటీఆర్ నిర్దేశించిన విధంగా నగరంలో తాగునీటి సరఫరాలో సమస్యలను అధిగమించి రోజూ అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని నగర మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ ప్రావీణ్యలు అధికారులను ఆదేశించారు. గురువారం బల్దియా ప్రధాన కార్యాలయంలో 36, 20, 25, 27, 28, 34, 37, 39, 42 డివిజన్ల కార్పొరేటర్లు, ఎస్ఈ ప్రవీణ్ చంద్ర, రిటైర్డ్ సీఈ రవికుమార్‌లతో కలిసి సమీక్షించారు. తాగునీటి సరఫరా సమస్యలు, వచ్చే వర్షాకాలంలో ముంపునకు గురికాకుండా చేపట్టాల్సిన చర్యలపై డివిజన్ల వారీగా ఆయా కార్పొరేటర్లతో మాట్లాడారు. ప్రతి రోజూ తాగునీరందించడంలో ఎదురయ్యే సాంకేతికపరమైన సమస్యలను అధిగమించేందుకు నిపుణుడు రవికుమార్ సహకారం తీసుకోవాలన్నారు. కార్పొరేటర్లు తెలిపిన సమస్యలను పరిష్కరించేందుకు మిషన్ భగీరథ, బల్దియా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి తక్షణమే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రోజు 45 నిమిషాలు అన్ని ప్రాంతాలకు, గృహాలకు నీరు అందించాలన్నారు. సమావేశంలో బల్దియా ఈఈలు శ్రీనివాసరావు, సంజయ్‌కుమార్, డీఈఈలు రవికిరణ్, నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

చదువుతోనే మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి

హనుమకొండ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.కృష్ణమూర్తి



ర్యాలీలో పాల్గొన్న న్యాయమూర్తులు, ఉన్నతాధికారులు, న్యాయశాఖ ఉద్యోగులు

వరంగల్ లీగల్: చదువుకోవడం వల్ల స్త్రీ తన కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవడమే కాకుండా తనంతటతానే నిలబడే శక్తి సంపాదించుకోవచ్చని హనుమకొండ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.కృష్ణమూర్తి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం హనుమకొండ, వరంగల్ జిల్లాల న్యాయసేవాధికార సంస్థలు సంయుక్తంగా జిల్లా కోర్టు ప్రాంగణం నుంచి కాళోజి మార్గ్ వరకు నిర్వహించిన ర్యాలీని ఎం.కృష్ణమూర్తితోపాటు వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ ప్రధాన న్యాయమూర్తి సి.పావని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి ఎం.కృష్ణమూర్తి మాట్లాడుతూ స్త్రీ విద్య, సంపద అనేది పిల్లల, కుటుంబ భవిష్యత్, సమాజ శ్రేయస్సుకు ఎంతో అవసరమన్నారు. మహిళల్లో దాగి ఉన్న శక్తిని బయటికి తీయడమే కాకుండా, వారిలో స్ఫూర్తి నింపి ముందుకు నడిపించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా ఎదగడానికి ప్రోత్సాహం అందించాలని కోరారు. మహిళల హక్కులు, చట్టాలు, బాధ్యతల పట్ల అవగాహన కలిగి ఉన్నప్పుడే స్త్రీ సాధికారతకు వీలవుతుందని తెలిపారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు ఎం.పద్మజ, వై.సత్యేంద్ర, టి.జయలక్ష్మి, వరంగల్ న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి జె.ఉపేందర్‌రావు, జూనియర్ న్యాయమూర్తులు కె.చండీశ్వరీదేవి, అనితా రాపోల్, గోపికా నాగశ్రావ్య, జి.శశి, మట్ట సరిత, షేక్ ఆరీఫ్, న్యాయశాఖ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా..

మార్కెట్‌లో మెరిసిన ఎర్ర బంగారం



మార్కెట్‌కు వచ్చిన మిర్చి బస్తాలు

వరంగల్: వరంగల్ వ్యవసాయ మార్కెట్‌లో విక్రయానికి తెచ్చిన మిర్చి బస్తాలతో ముంచెత్తింది. హోలీ సందర్భంగా వరుసగా రెండ్రోజులు సెలవులు రావడంతో గురువారం సుమారు 65 వేల బస్తాలు వచ్చినట్లు మార్కెట్ వర్గాలు తెలిపాయి. పెద్ద మొత్తంలో మిర్చి రావడంతో ధరలు కొంత మేరకు తగ్గాయని రైతులు వాపోయారు. గురువారం రోజున తేజ రకానికి క్వింటాలుకు గరిష్ఠంగా రూ.20,800లు, వండర్‌హాట్‌కు రూ.36వేలు, యూఎస్-341కు రూ.21,500లు, డీడీ రకానికి రూ.22,500లు, దీపిక రకానికి రూ.28వేలు, దేశీ రకానికి రూ.65వేలు, సింగిల్ పట్టికి రూ.51వేలు, 1048 రకానికి రూ.21వేలు, తాలు రకానికి రూ.8,700లు ధరలు లభించినట్లు రైతులు తెలిపారు.

భీమారంలో పులి సంచారం?



ప్రత్యక్ష సాక్షిని విచారిస్తున్న పోలీసులు

హసన్‌పర్తి: మండలంలోని భీమారంలో పులి కనిపించిందన్న వార్త సంచలనమైంది. గురువారం మధ్యాహ్నం భీమారంలోని శ్యామలచెరువు సమీపంలో కూలీ లక్ష్మయ్యకు పులి కనిపించింది. మొదట కుక్క అనుకుని చూస్తూ నిల్చున్నానని, కానీ సమీపిస్తున్నా కొద్ది పులి అని తెలిసి పరుగు లంఘించానని లక్ష్మయ్య తెలిపాడు. పులి పక్కనే ఉన్న జొన్న చేలలోకి వెళ్లినట్లు ప్రత్యక్ష సాక్షి చెబుతున్నాడు. సమాచారం అందుకున్న స్థానిక ఎస్సైలు రాజ్‌కుమార్, విజయ్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకుని ప్రత్యక్ష సాక్షితో మాట్లాడారు. పులి అడుగుల్ని పరిశీలించారు. అడుగులు స్పష్టంగా లేవని తెలిపారు. కాగా.. ఇదివరకే కోమటిపల్లిలోని ఆర్‌ఓఆర్ వద్ద, చింతగట్టులోని మామిడి తోటవద్ద పులిని చూసినట్లు స్థానికులు చెబుతున్నారు.

ఇంటర్‌తో సాఫ్ట్‌వేర్ జాబ్

- మైనార్టీ గురుకులాల విద్యార్థులకు వరం
- హెచ్‌సీఎల్‌తో టెమ్రిస్ అవగాహన ఒప్పందం
- అర్హత కోసం ఆన్‌లైన్‌లో స్క్రీనింగ్ టెస్ట్



వరంగల్ జక్కలొద్ది గురుకులంలో ఆన్‌లైన్ పరీక్షకు హాజరైన విద్యార్థులు

న్యూశాయంపేట: మైనార్టీ గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులకు ఇంటర్ పూర్తి చేసిన వెంటనే.. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా తెలంగాణ మైనార్టీ గురుకులాల విద్యా సంస్థ(టెమ్రిస్) ఆదిశగా ముందడుగేసింది. ఇంటర్‌లో అత్యుత్తమ ఫలితాలు సాధిస్తున్న విద్యార్థులను ఎంపిక చేసి వారికి ప్రపంచస్థాయి ఐటీ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు ఇప్పించేందుకు ముందుకొచ్చింది. ఈమేరకు హెచ్‌సీఎల్ టెక్నాలజీస్‌తో అవగాహన ఒప్పందం చేసుకుంది. రాష్ట్ర వ్యాప్తంగా 204 మైనార్టీ గురుకులాలున్నాయి. వీటన్నింటినీ జూనియర్ కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేశారు. ఇందులో ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీతో పాటు వృత్తి విద్యను అందిస్తున్నారు. విద్యార్థుల ఛాయిస్ అనుగుణంగా వారిని తీర్చిదిద్దేందుకు సెక్రటరీ షఫియుల్లాతో పాటు టెమ్రిస్ అధికారులు ప్రణాళికలు రూపొందించారు.

ఎంపిక ఇలా..

విద్యార్థుల ఎంపిక కోసం ఆన్‌లైన్ స్క్రీనింగ్ టెస్ట్‌ను హెచ్‌సీఎల్ కంపెనీ నిర్వహిస్తోంది. ఈటెస్ట్‌ను రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఎంపిక చేసిన మూడు గురుకులాల్లో నిర్వహిస్తున్నారు. బాల బాలికలకు వేర్వేరుగా ఎంపిక పరీక్షలు నిర్వహిస్తున్నారు. స్క్రీనింగ్ టెస్ట్ పూర్తయ్యాక ఇంటర్ వ్యూ తీసుకుంటారు. ఇంటర్ బోర్డు ఎగ్జామ్‌లో 75 శాతం మార్కులు సాధించిన విద్యార్థులను ఎంపిక చేసి ఎంట్రీ లెవల్ ఐటీ జాబ్‌కి ఎంపిక చేస్తారు. అనంతరం ఆర్నెళ్ల పాటు క్లాస్‌రూమ్ ట్రెనింగ్(సీఆర్టీ), మరో ఆర్నెళ్ల పాటు ఆన్ ది జాబ్(ఓజేటీ) శిక్షణ అందిస్తారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి పూర్తి స్థాయిలో ఉద్యోగంలోకి తీసుకుని వారికి సంవత్సరానికి రెండులక్షల పైచీలకు వేతనం అందించి వీకెండ్స్‌లో ఉద్యోగంతో పాటు ఉన్నత విద్యను అందించనున్నారు.

స్క్రీనింగ్ టెస్ట్ కేంద్రాలివే..

రాష్ట్ర వ్యాప్తంగా మూడు కేంద్రాలుండగా.. కరీంనగర్, ఖమ్మం వరంగల్ జిల్లాల విద్యార్థులు (వరంగల్ రంగశాయిపేట శివారు జక్కలొద్ది బాలుర-1) గురుకులంలో పరీక్ష రాస్తున్నారు. ఈనెల 9, 10, 11 తేదీల్లో ఆన్‌లైన్‌లో పరీక్షలు జరుగనున్నాయి. మొత్తం మూడు రోజుల్లో 257 మంది విద్యార్థులు ఈ పరీక్షలు రాయనున్నారు.

ఇంటర్ పూర్తవగానే ఉద్యోగం

ఇంటర్‌లో ఎంపీసీ, ఎంఈసీ తీసుకున్న ప్రతిభ గల విద్యార్థులు సెకెండ్ ఇయర్ పూర్తవ్వగానే ప్రముఖ ఐటీ కంపెనీ హెచ్‌సీఎల్‌లో (హెచ్‌సీఎల్-టెక్‌బీ) ప్రోగ్రామ్‌లో భాగంగా ఉద్యోగ అవకాశం కల్పించేందుకు చర్యలు తీసుకుంది. ప్రతిభ గల విద్యార్థులను ఎంపిక చేసి కంపెనీ వారికి ఆన్‌లైన్ టెస్ట్ నిర్వహిస్తోంది. టెస్టులో ఎంపికైన విద్యార్థులకు ప్లేస్‌మెంట్ కల్పించి ఏడాది పాటు శిక్షణ ఇవ్వనుంది. శిక్షణలో వారికి రూ.12 వేలు ఉపకార వేతనం కూడా అందజేస్తుంది. ఇటు ఉద్యోగ అవకాశంతో పాటు ఉన్నత విద్యను అభ్యసించేందుకు వీలుగా తోడ్పాటు అందిస్తున్నారు.

ఫ్యూచర్ కోసం..



కంపెనీ ఫ్యూచర్ ఎంప్లాయీస్ తయారీలో భాగంగానే ఈ నిర్ణయం తీసుకుంది. విద్యార్థులకు ఉన్నత ఉద్యోగావకాశాలు లభిస్తాయి. ఇంటర్ తర్వాత సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా మంచి వేతనంతో స్థిరపడవచ్చు.

- నరేశ్, కంపెనీ క్లస్ లీడ్

ఉన్నత శిఖరాలు అధిరోహించాలనే..



టెమ్రిస్‌లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు విద్యతో పాటు జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలనే మా సెక్రటరీ షఫియుల్లా ఉద్దేశ్యం. ఆయన ఆలోచనలకు అణుగుణంగా విద్యార్థులను తయారు చేస్తున్నాం.

- జి.భిక్షపతి, ప్రిన్సిపాల్, వరంగల్ బాలురు-1

సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తా..



టెమ్రిస్‌లో విద్యనభ్యసించి మంచి సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉన్నత ఉద్యోగం సాధిస్తా. ఇది మాలాంటి పేద పిల్లలకు ప్రభుత్వం ఇచ్చిన వరం.

- జవ్వాద్ రజా ఇంటర్ విద్యార్థి, (మెట్‌పల్లి బాలురు-1)

కల్వర్టును ఢీకొన్న కారు

- వధువు కుటుంబీకులకు తీవ్ర గాయాలు




చికిత్స పొందుతున్న క్షతగాత్రురాలు

మహదేవపూర్: బ్రాహ్మణపెల్లి ఎస్సీ కాలనీ దగ్గర కల్వర్టును కారు ఢీకొని అందులో ప్రయాణిస్తున్న ఐదుగురికి (వధువు అత్త, మామ, బావ, తోడికోడలు, చిన్నత్త) తీవ్ర గాయాలయ్యాయి. మహదేవపూర్ మండలం బొమ్మపూర్‌కు చెందిన నాగుల సంజీవరెడ్డి కుమార్తె స్పందనరెడ్డి వివాహం బొప్పారం (శ్రీనివాస్‌పల్లి)గ్రామానికి చెందిన గోడిసెల పృథ్వీధర్‌తో కాటారం మండల కేంద్రంలో గురువారం జరిగింది. వివాహ అనంతరం పెళ్లికూతురు అప్పగింతల కోసం కుటుంబీకులు కాటారం నుంచి బొమ్మపూర్‌కు కారులో వస్తుండగా బ్రాహ్మణపెల్లి సమీపంలోని కల్వర్టును కారు అధిక స్పీడుతో ఢీకొట్టడంతో కారులో ఉన్న ఎయిర్ బ్యాగ్స్ ఓపెన్ అయ్యాయి. ఎలాంటి ప్రాణనష్టం జరగకపోగా.. ఐదుగురికి కాళ్లు విరిగాయి. దీంతో స్థానికులు 108 ద్వారా మాదాపూర్ సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని తరలించి, ప్రథమ చికిత్స అనంతరం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. గోడిసెల రాజిరెడ్డి, రాజక్క, వామన్‌రెడ్డి, మాలతి, వెన్నపురెడ్డి వసంత, ద్వారాక్‌కు తీవ్ర గాయాలయ్యాయి.

అసాంఘిక కలాపాలకు అడ్డా!

- బహిరంగ మలమూత్ర విసర్జన
- పురాతన భవనాలు కూల్చేయాలని విన్నపం



పాడుబడిన బంగ్లాను తలపిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనం (ఫైల్)

హన్మకొండ చౌరస్తా: మాజీ ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి చదువుకున్న కళాశాల అది. అయనే కాదు ఎందరో మేధావులను తీర్చిదిద్దిన ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రస్తుతం భూత్ బంగ్లాను తలపిస్తోంది. హనుమకొండలోని అశోకా జంక్షన్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనం (పాతది) శిథిలావస్థకు చేరుకుంది. సుమారు ఐదేళ్ల క్రితమే ఎదురుగా నూతన భవనాన్ని నిర్మించి కళాశాలను అందులోకి మార్చారు. కళాశాల పాత భవనాన్ని అలాగే వదిలేయడంతో పిచ్చిమొక్కలు, అసాంఘిక కార్యకలాపాలకు భవనాలు అడ్డాగా మారాయి. బహిరంగ మల, మూత్ర విసర్జనకు కేరాఫ్ నిలుస్తున్నాయి. హనుమకొండ పట్టణం నడిబొడ్డున ఉన్న భవనాలు దుర్గంధభరితంగా మారి కంపుకొడుతున్నాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాల (పాతది) భవనానికి అనుకుని ప్రభుత్వ ఉన్నత పాఠశాల కొనసాగుతోంది. శిథిలావస్థకు చేరుకున్న కళాశాల భవనాల నుంచి విషకీటకాలతో పాటు దుర్వాసన వస్తోందని పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆవేదన చెందుతున్నారు. శిథిలావస్థకు చేరుకున్న భవనాలను కూల్చేసి, ఆ స్థలాన్ని శుభ్రం చేయాలని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పట్టణ ప్రజలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.



పాత ఇంటర్ కాలేజీ చుట్టూ డ్రెయినేజీ నీరు



ప్రభుత్వ జూనియర్ కళాశాల పాత భవనం



కళాశాల ఆవరణలో పేరుకుపోయిన చెత్త



ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానం ఇలా..

బాలుడి చావుకు కారణమైన డ్రైవర్‌కు జైలు

వరంగల్ లీగల్: అతివేగం, అజాగ్రత్తగా లారీ నడిపి సైకిల్‌ను ఢీకొట్టి ఓ విద్యార్థి మృతికి కారణమైన లారీ డ్రైవర్ వైనాల శివకృష్ణకు రెండేళ్ల జైలు శిక్ష విధిస్తూ ఫస్ట్ ఎంఎం కోర్టు జడ్జి గోపిక నాగశ్రావ్య గురువారం తీర్పు వెల్లడించారు. పోలీసులు తెలిపిన కథనం ప్రకారం.. మడికొండకు చెందిన పాఠశాల విద్యార్థులు పల్లపు సన్ని అలియాస్ జితేందర్(13) అతడి మిత్రుడు గడ్డం జయవర్ధన్ 2017, ఆగస్టు 15న పాఠశాలలో జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొన్నారు. సైకిల్‌పై ఇంటికి తిరిగి వస్తున్న క్రమంలో ధర్మసాగర్ నుంచి మడికొండకు వస్తుండగా (ఏపీ15 టీబీ 7108) లారీ అతివేగంతో వచ్చి సైకిల్‌ను ఢీకొట్టడంతో ఇరువురు విద్యార్థులు కింద పడ్డారు. సన్ని అలియాస్ జితేందర్ నడుముపై నుంచి లారీ టైరు వెళ్లగా, వెనకాల కూర్చున జయవర్ధన్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే సమీపంలోని అస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం జితేందర్‌ను రోహిణి హాస్పిటల్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మధ్యాహ్నం రెండు గంటల సమయంలో జితేందర్ మృతి చెందాడు. మృతుడి తండ్రి పల్లపు వెంకటేశ్ ఫిర్యాదు మేరకు మడికొండ పోలీసులు కేసు నమోదు చేశారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన కోర్టు నేరం రుజువు కావడంతో లారీ డ్రైవర్ నల్లబెల్లి మండలం గుండ్లపహాడ్ గ్రామానికి చెందిన ప్రస్తుతం శివనగర్‌లో నివస్తున్న వైనాల శివకృష్ణ రెండేళ్ల జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ జడ్జి గోపి నాగశ్రావ్య తీర్పు వెల్లడించారు. కేసులను మడికొండ ఎస్సై మధుప్రసాద్ దర్యాప్తు చేయగా.. సాక్షులను కానిస్టేబుళ్లు ఎ.అశోక్ కోర్టులో ప్రవేశ పెట్టారు. ప్రాసిక్యూషన్ పక్షాన ఏపీపీ రాంప్రసాద్ కేసు వాదించారు.

ఇంటికొస్తున్నానంటూ వెళ్లిపోయావా?

- గుండెపోటుతో పారిశుద్ధ్య కార్మికుడి మృతి



ఖిలా వరంగల్: 'ఇంటికొస్తున్నా.. స్నానానికి వేడి నీళ్లు పెట్టండి. అని ఇంటికి రాకుండానే వెళ్లిపోయావా' అంటూ కుటుంబీకుల రోదనలు మిన్నంటాయి. ఉదయాన్నే నగరాన్ని శుభ్రం చేసేందుకు వెళ్లిన పారిశుద్ధ్య కార్మికుడు ఇంటికి చేరకుండానే అనంత లోకాలకు చేరాడు. గుండెపోటుతో వరంగల్ 38వ డివిజన్ పడమరకోట వీరుని గడ్డకు చెందిన కాగితాల కోర్నెల్(58) మృతి చెందాడు. మహానగర పాలక సంస్థలో పారిశుద్ధ్య కార్మికుడిగా పని చేస్తున్న కోర్నెల్ రోజువారీగానే గురువారం ఉదయం 5 గంటలకే విధుల్లో చేరాడు. పడమరకోట కాపు వీధిలో మధ్యాహ్నం పని ముగించుకుని మరో 10 నిమిషాల్లో ఇంటికి చేరుతాడనగా.. ఇంతలో కోర్నెల్‌కు ఆకస్మాత్తుగా గుండెపోటు వచ్చి రోడ్డుపై కుప్పకూలాడు. స్థానికులు అతడిని పరిశీలిస్తుండగానే ప్రాణాలు వీడిచాడు. మృతదేహాన్ని వీరునిగడ్డలోని స్వగృహానికి తరలించారు. ఈవిషయం తెలిసిన వెంటనే స్థానిక జవాన్ కుమారస్వామి, తోటి పారిశుద్ధ్య కార్మికులతో కలిసి స్థానిక కార్పొరేటర్ బైరబోయిన ఉమ, మాజీ కార్పొరేటర్ బైరబోయిన దామోదర్‌యాదవ్ మృతదేహాన్ని సందర్శించారు. మృతదేహంపై వారు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దహన సంస్కారాల నిమిత్తం కోర్నెల్ కుటుంబానికి బైరబోయిన దామోదర్ ఆర్థిక సాయం అందజేశారు.

దయనీయ స్థితిలో దహన సంస్కారాలు

- సొంతిల్లు లేక టెంట్ కిందే మృతదేహం



వంశీకృష్ణ మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు, గ్రామస్తులు

గీసుకొండ: స్నేహితుడి ఇంట్లో బంగారం చోరీకి పాల్పడ్డాడని స్నేహితుడి తల్లిదండ్రులు, దొంగతనం చేసినట్లు ఒప్పుకొమ్మని పోలీసులు బెదిరించారని మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్న పోలం వంశీకృష్ణ దహన సంస్కారాలు అత్యంత దయనీయ స్థితిలో జరిగాయి. బుధవారం రాత్రి ఎంజీఎం ఆస్పత్రి మార్చురీలో పోస్టుమార్టం నిర్వహించారు. మృతదేహాన్ని అతడి అమ్మమ్మ ఉండే గీసుకొండ మండలం శాయంపేట హవేలికి గురువారం ఉదయం తరలించారు. కాగా.. అతడి కుటుంబానికి స్వస్థలం హసన్‌పర్తిలో ఇల్లు లేకపోగా.. శాయంపేటహవేలిలో ఉంటున్న అమ్మమ్మ బుచ్చమ్మకు కూడా ఇల్లు లేదు. దీంతో ఆమె అద్దె ఇంట్లో ఉంటోంది. ఇల్లు లేకపోవడంతో అమ్మమ్మ కిరాయికి ఉంటున్న ఇంటి పక్కన ఖాళీ స్థలంలో టెంట్ వేసి మృతదేహాన్ని బంధువుల సందర్శన కోసం ఉంచారు. వంశీకృష్ణ అవివాహితుడు కావడంతో సంప్రదాయం ప్రకారం జిల్లేడు చెట్టుతో వివాహం జరిపించారు. అశ్రునయనాల మధ్య గ్రామస్తులు అంతిమ యాత్ర నిర్వహించి దహన సంస్కారాలు జరిపారు. ఎదిగిన కొడుకును కోల్పోయిన తల్లి రాధ, ఆమె కూతురుతో పాటు అమ్మమ్మ బుచ్చమ్మల పరిస్థితి దయనీయంగా మారింది. ఉండడానికి ఇల్లు లేక, జీవనానికి ఆసరా లేకపోవడంతో వారిని ప్రభుత్వ ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

చైన్ స్నాచర్ అరెస్ట్



మాట్లాడుతున్న క్రైమ్ డీసీపీ మురళీధర్

కాజీపేట: జల్సాలకు అలవాటు పడి వరుస చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్న దొంగను పోలీసులు అరెస్ట్ చేశారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో క్రైమ్ డీసీపీ మురళీధర్ వివరాలు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన సయ్యద్ అమన్ వరంగల్‌లోని బంధువుల ఇంట్లో ఆర్నెళ్లుగా ఉంటూ స్విగ్గీ బాయ్‌గా పని చేస్తున్నాడు. జల్సాలకు డబ్బులు సరిపోక, దొంగతనాలు చేయాలనుకున్నాడు. ఇంటి ఓనర్ హోండా ఆక్టివా స్కూటర్‌ను వాడుకుని మొదటిసారిగా ఫిబ్రవరి 7న హనుమకొండ అడ్వకేట్ కాలనీలో రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న నలుగురు యువతులను టార్గెట్ చేసి ఓ యువతి మెడ నుంచి గొలుసు తెంపేసుకువెళ్లాడు. అదే నెల 17న ఎక్సైజ్ కాలనీలో ఒంటరిగా నడుచుకుంటూ వస్తున్న మహిళ మెడ నుంచి గొలుసు తెంపేసుకుని వెళ్లాడు. 24న ఏకశిల పార్క్ వద్ద ఒంటరిగా వస్తున్న మహిళ మెడ నుంచి గొలుసు అపహరించాడు. ఇలా దొంగతనాలు చేయగా.. దొరికిన బంగారాన్ని గార్లపాటి నాగేంద్ర బాబు (షణ్ముఖ గోల్డ్ షాపు), మడత వంశీకృష్ణ (హరపుత్ర గోల్డ్ షాపు), గుండు శివప్రసాద్ (శివసాయి గోల్డ్ షాపు)లకు విక్రయించాడు. నిందితుడి సమాచారం మేరకు బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకుని నిందితుడిని కోర్టులో హాజరుపర్చారు. అడిషనల్ డీసీపీ పుష్ప, క్రైమ్ ఏసీపీ డేవిడ్‌రాజు, ఇన్‌స్పెక్టర్ ఎల్.రమేశ్‌కుమార్, షుకూర్, సీసీఎస్ ఎస్సైలు రాజేందర్, సంపత్‌కుమార్‌తో పాటు సిబ్బందిని సీపీ డాక్టర్ ఏవీ రంగనాథ్ అభినందించారు.


రోడ్డు ప్రమాదంలో టైపిస్ట్ మృతి



సత్యనారాయణ(ఫైల్)

హసన్‌పర్తి: హనుమకొండ-కరీంనగర్ ప్రధాన రహదారిలోని కేఎల్‌ఎన్ గార్డెన్ సమీపంలో గురువారం డీసీఎం-బైక్ ఢీకొని కరీంనగర్‌కు చెందిన వి.సత్యనారాయరెడ్డి (56)మృతి చెందాడు. సత్యనారాయరెడ్డి చింతగట్టు క్యాంప్‌లోని క్వాలిటీ కంట్రోల్‌లో టైపిస్ట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ప్రతీరోజు కరీంనగర్ నుంచే రాకపోకలు సాగిస్తున్నాడు. గురువారం విధులు ముగిశాక సహోద్యోగి రవీందర్ (జూనియర్ అసిస్టెంట్)తో కలిసి బైక్‌పై ఎర్రగట్టుగుట్ట వద్ద బస్సు ఎక్కడానికి బయల్దేరాడు. అయితే కేఎస్‌ఎల్ గార్డెన్ సమీపంలో వీరు ప్రయాణిస్తున్న బైక్‌ను వెనుక నుంచి డీసీఎం ఢీకొంది. ఈప్రమాదంలో వెనుక వైపు కూర్చున్న సత్యనారాయణరెడ్డి తలకు బలమైన గాయాలై అక్కడక్కడే మృతి చెందాడు. బైక్ నడుపుతున్న రవీందర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం ఆస్పతికి తరలించారు. మృతుడి సోదరుడు శ్రీనివాస్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు కేయూసీ పోలీసులు తెలిపారు.

కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య



రాధిక మృతదేహం

స్టేషన్‌ఘన్‌పూర్: కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురైన వివాహిత గైని రాధిక(36) ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మండలంలోని పాంనూర్‌కు చెందిన రాధికకు మీదికొండకు చెందిన గైని రాజుతో 18 ఏళ్ల క్రితం వివాహమైంది. రాధిక దంపతులు ఇద్దరు కుమారులతో కలిసి రాధిక తండ్రి కొమురయ్య ఇంట్లో ఉంటున్నారు. కొంతకాలంగా కుటుంబ కలహాలు జరుగుతున్నాయి. తండ్రి కొమురయ్య తన ఇంట్లో ఉండొద్దని, వెళ్లిపోవాలని కుమార్తెతో గొడవ పడుతున్నాడు. ఈ క్రమంలో గురువారం తండ్రితో రాధికకు గొడవ జరిగింది. మనస్తాపం చెందిన ఆమె ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుంది. పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని శవపంచనామా చేశారు. కుటుంబీకులు కన్నీరు మున్నీరుగా విలపించారు. కాగా.. మృతురాలి భర్త రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు సీఐ రాఘవేందర్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

భక్తుల సందడి

- కొనసాగుతున్న అన్నదానం
- ప్రముఖుల పూజలు



దర్శనానికి వేచి ఉన్న భక్తులు

హసన్‌పర్తి: ఎర్రగట్టు వేంకటేశ్వరస్వామి జాతర భక్తులతో కిటకిటలాడుతోంది. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని మూడోరోజు గురువారం రాత్రి భక్తుల తాకిడి కనిపించింది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు హాజరై మొక్కులు సమర్పించుకున్నారు.

ప్రముఖుల పూజలు

బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని వివిధ పార్టీలు, అధికారులు పూజలు నిర్వహించారు. దేవాదాయశాఖ డిప్యూటీ కమిషన్ శ్రీకాంత్‌రావు, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఏనుగుల రాకేశ్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చింత సదానందం, కార్పొరేటర్ శివకుమార్, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు శ్రీధర్ స్వామి వారిని దర్శించుకున్నారు.

కొనసాగుతున్న అన్నదానం..

బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని విశ్వక్సేనా ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం కొనసాగుతోంది. మూడో రోజు సుమారు వేయి మంది భక్తులు అన్నదానంలో పాల్గొన్నారు.